సైలెంట్ ఓటు ఎటువైపో?

- తూర్పులో ఎంవీవీ, వెలగపూడి మధ్య బిగ్‌ఫైట్
- వైఎస్సార్‌సీపీ, టీడీపీకి మద్దతుగా నిలిచిన ఓటర్ల సాంద్రత గల ప్రాంతాలు


13న సాయంత్రం 6 తరువాత ఓటు హక్కు వినియోగించుకునేందుకు అప్పుఘర్ పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు

ఎంవీపీ కాలనీ: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య పోటీ నువ్వా.. నేనా అన్నట్లు సాగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలోని జనసాంద్రత కలిగిన ప్రాంతాల ఓటర్లు ఇరు పార్టీలకు సమానంగా మొగ్గుచూపడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో 2,92,206 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 2,00,563 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి 68.64 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో (2019) 64.73 శాతంతో పోలిస్తే 3.91 శాతం అధికంగా ఓటింగ్ నమోదైంది. అయితే ఈ ఎన్నికలు గతంలో కంటే భిన్నంగా జరిగాయంటూ నియోజకవర్గ సీనియర్ నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు కారణంగా గతంలో అభ్యర్థుల గెలుపుని డిసైడ్ చేసిన ఓటింగ్ శాతం అధికంగా ఉన్న ప్రాంతాల జనాభా తీరే. తూర్పులో ఆరిలోవ, అప్పుఘర్, ఆదర్శనగర్, పెదజాలరిపేట, కేఆర్‌ఎం కాలనీ, చినవాల్తేర్ రెల్లి వీధి ప్రాంతాల్లో ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులకు ఆయా ప్రాంతాల ఓటర్లు పోటాపోటీగా మద్దతు తెలిపారు. గతంలో టీడీపీకి కంచుకోటగా నిలిచిన ఆరిలోవ, అప్పుఘర్, పెదజాలరిపేట ప్రాంతాల్లో ఓటింగ్ సరళి గతం కంటే భిన్నంగా జరిగింది. గతంలో టీడీపీకి ఏకపక్షంగా నిలిచిన ఈ ప్రాంతా ఓటర్లు ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా నిలిచారు. దీంతో తూర్పులో గెలుపు ఎవరిదనే దానిపై రాజకీయ విశ్లేషకులకు సైతం అంతుచిక్కడం లేదు.

క్లాస్, మహిళా ఓటింగే కీలకం

ఈ సందిగ్ధత నేపథ్యంలో నియోజకవర్గంలో గెలుపు క్లాస్ ఓటర్ల మొగ్గుతో పాటు మహిళా ఓటర్ల ఆదరణపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో 1,04,324 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 10 గంటల వరకు పలు పోలింగ్ కేంద్రాల్లో నిరీక్షించి మరీ మహిళలు ఓటు వేయడం విశేషం. ఇంత పెద్ద మొత్తంలో మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపులో వారి పాత్ర కీలకమని స్పష్టమవుతోంది. దీంతో మహిళల ఓటింగ్ ఏ పార్టీ అభ్యర్థికి ఎక్కువగా పడిందనే అంశంపై పెద్ద ఎత్తున నియోజకవర్గంలో చర్చలు సాగుతున్నాయి. గతంతో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో ఓటర్లు సైలెంట్ ఓటింగ్‌కు ప్రాధాన్యమిచ్చారు. దీంతో ఎవరి నాడి ఏంటో తెలుసుకోవడం కష్ట సాధ్యమంటూ విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు. అయితే సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడ్డాయి. వారంతా వైఎస్సార్‌సీపీకే మొగ్గు చూపే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. దీంతో పాటు ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే, విశాలాక్షినగర్, ఈస్ట్ పాయింట్ కాలనీ, దసపల్లా హిల్స్, రామ్‌నగర్, సిరిపురం వీఐపీ రోడ్డు, విశాఖ ఐ హాస్పటల్ ప్రాంతాల్లోని క్లాస్ ఓటింగ్ ఓ పార్టీకి మద్దతుగా నిలిచిందనే దానిపై గెలుపు డిసైడ్ అవుతుందనే చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్ల సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇరు పార్టీలకు పోటాపోటీగా నిలిచిన నేపథ్యంలో ఈ సారి గెలుపు ఏ పార్టీని వరిస్తుందో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

సంప్రదాయ నృత్యాల్లో యువత రాణించాలి


భరతనాట్యం అరంగ్రేటం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

బీచ్‌రోడ్డు: సంప్రదాయ నృత్యాల్లో యువత రాణించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆకాంక్షించారు. నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన భరతనాట్యం అరంగేట్రం కార్యక్రమం అన్ని వర్గాలను అలరించింది. చెన్నైలోని రుక్మిణిదేవి కళాశాలకు చెందిన గురు సంతోషి విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య మయూరాలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు భరతనాట్యం ప్రతీకగా నిలుస్తుందన్నారు. అలాంటి గొప్ప నాట్యంలో యువత అరంగ్రేటం చేసి మన సంస్కృతికి జీవనం పోస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ కె.వెంకటరమణారావు, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్


కారుకు లాక్ వేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు


గురుద్వారా వద్ద ద్విచక్ర వాహనానికి లాక్ వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

- రాంగ్ పార్కింగ్ వాహనాలపై కొరడా
- 30 వాహనాలకు జరిమానాలు

సీతమ్మధార: రహదారి భద్రత దృష్ట్యా రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానాలు విధించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో రాంగ్ పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లకు లాక్ వేసి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రాంగ్ పార్కింగ్ చేసిన 30 వాహనాలకు రూ.1,035 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. చలానా చెల్లిస్తేనే ఈ వాహనాల లాక్ తీసి ఇస్తామని వాహనదారులకు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులను ఏర్పరచడానికే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

జోరుగా తాటి ముంజులు విక్రయాలు


తాటికాయ నుంచి ముంజులను వేరుస్తున్న రైతు

మద్దిలపాలెం : తాజా తాటి ముంజులు విక్రయాలు నగరంలో జోరుగా సాగుతున్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద తాటికాయలను కుప్పలుగా పోసి ముంజులను వేరు చేసి విక్రయిస్తున్నారు. డజను ముంజుల ధర రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది. కొందరు రైతులు తాడి ముంజులను బుట్టలో వేసుకుని వీధుల్లో తిరుగుతూ విక్రయాలు చేపడుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వెంకటరావు

అల్లిపురం: వచ్చేనెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జోన్–1 పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్–1 పరిధి ఈస్ట్ క్రైం ఏసీపీ వెంకటరత్నం ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్–1 ఏసీపీ వెంకటరావు ఆధ్వర్యంలో ఈస్ట్ క్రైం సీఐ ఆడమ్స్ టూటౌన్, త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని సుమారు 90 మంది రౌడీ షీటర్లకు అవగాహన కల్పించారు. ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ ఆడమ్స్ హెచ్చరించారు. పోలీసుల ఆంక్షలను అతిక్రమించిన వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ క్రైం ఎస్‌ఐ జీవీ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయం పరిశీలన


పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు

దాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించి విద్యార్థులు, బాలలతో మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరం ఎలా జరుగుతుంది? సిబ్బంది పనితీరు? సమ్మర్ క్యాంపు ఏ విధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. కథల పుస్తకాలు చదివి సారాంశం వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇన్‌చార్జి ఎల్‌ఆర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో ఎల్‌ఐసీ క్వార్టర్స్ వెనక సీఎంఆర్ స్ట్రీట్‌లో వరసిద్ధి వినాయక, గురుసాయి మందిరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. పది రోజులుగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ సహాయంతో చలివేంద్రం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎస్.కోటి, ఎస్‌కే సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో అక్రమ నిర్మాణాలపై నిరసన


నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్ దరి ఇందిరానగర్ గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న అక్రమణ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ఆ కాలనీ వాసులు శబరి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసనకు దిగారు. కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీని ఆనుకుని గ్రీన్‌బెల్ట్ ఉందన్నారు. దశాబ్దాలుగా ఆ గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వాణిజ్య దుకాణాలు నిర్వహిస్తున్నారని, వాటిని తొలగించాలని కోరుతూ గతంలో పలు ఆందోళనలు చేసినట్లు తెలిపారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు, నాయకులు గ్రీన్‌బెల్ట్‌ను తిరిగి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రస్తుతం ఆ దుకాణాల స్థానంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దలాయి సూర్యనారాయణ, దలాయి సతీష్‌కుమార్, సంపత్, మణి, గోపీకృష్ణ, ప్రకాశ్, మోహన్, అభిషేక్, వై.రవి, ప్రసాద్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో భయపెడుతున్న శునకాలు


వర్సిటీలో తిష్ట వేసిన శునకాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీలో శునకాలు భయపెడుతున్నాయి. వర్సిటీ పరిసరాల్లో కుక్కలు పదుల సంఖ్యలో గుంపుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనచోదకుల వెంట పడుతూ దాడి చేస్తున్నాయి. జీవీఎంసీ సిబ్బంది స్పందించి శునకాలను కట్టడి చేసే దిశగా దృష్టి సారించాలని వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి


ప్రసంగిస్తున్న కమలానంద భారతిస్వామి

సీతంపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణహీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకరమఠంలో 'దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ' అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని స్థితిగతులు, జీవన విధానం ఆలోచనలు, పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వాటి పర్యావసానం, వాటి నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సభికులు అడిగిన ప్రశ్నలకు కమలానంద భారతి స్వామి సమాధానాలిచ్చి సందేహ నివృత్తి చేశారు.

మత సామరస్యంతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలీజియస్ ఫ్రీడం (ఐఏఆర్‌ఎఫ్) సంస్థ 125వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, మత సామరస్యానికి ఐఏఆర్‌ఎఫ్ చేసిన కృషిని వివరించారు. మనిషికి ఉండే స్వేచ్ఛపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, మత సామరస్యానికి స్వేచ్ఛ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.మిషన్ కార్యదర్శి స్వాసం నేద్యానంద స్వామి, ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సమసిద్దీన్, రత్నకుమార్, బి.కె.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.
– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

మధురవాడ జోనల్ ఆఫీస్‌కు న్యూలుక్

- రూ.50 లక్షలతో చురుగ్గా పనులు


పనులు పూర్తయ్యాక జోనల్ కార్యాలయం ఇలా... (ఊహాచిత్రం)

మధురవాడ : స్థానిక జోనల్ కార్యాలయం కొత్త రూపు సంతరించుకుంటోంది. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో కొన్ని విభాగాలు పునర్నిర్మించడంతోపాటు సుందరీకరణ పనులకు ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్మార్ట్ సిటీ, పరిపాలన రాజధానిలో భాగం కానున్న ఈ భవనం రూపురేఖలే పూర్తిగా మారిపోతున్నాయి. మరమ్మతులతో పాటు పుట్టీ, సీలింగ్, పెయింటింగ్, వైరింగ్ పనులు, కొత్తగా కిటికీలు, తలుపులు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తున్నారు. టాయిలెట్లు, ప్రహరీ నిర్మిస్తున్నారు. అలాగే ఫ్లోరింగ్, ఫుట్‌పాత్‌ని కూడా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం భవనాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తయారు చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. ఇటీవల ఆయన పనులను పరిశీలించి స్థానిక ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈఈ శాంతిరాజు పనులను పర్యవేక్షిస్తున్నారు.


రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రస్తుత జోనల్ ఆఫీసు

ఆకట్టుకున్న సంగీత గాత్ర కచేరీ


మండా సుధారాణిని సత్కరిస్తున్న వంకాయల వెంకటరమణ, తదితరులు

సీతంపేట: శంకరమఠంలో ఆదివారం సాయంత్రం సంగీత సుధానిధి ఇవటూరి విజయేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్ర సంగీత కచేరీ సభికులను ఆకట్టుకుంది. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మండా సుధారాణి తన మృదు మధురమైన గాత్రంతో గీతాలు ఆలపించి అలరించారు. ఈమెకు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయోలిన్‌పై, వంకాయల వెంకటరమణమూర్తి మృదంగంపై, గొట్టుముక్కల వెంకటేష్ మోర్సింగ్‌పై వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా మండా సుధారాణిని ఘనంగా సత్కరించారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నేత్ర వైద్యురాలు డాక్టర్ పితాని రమాదేవి సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకు లేదా ఏడాదికోసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం, కనుపాపల్లో తేలికపాటి సమస్యలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కంటి ఆరోగ్యం కోసం ఏ, సీ, ఈ విటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. టీవీ, మొబైల్, కంప్యూటర్‌లను పరిమితంగా వాడాలని సూచించారు. డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగడం, కనీసం 7–8 గంటల నిద్ర, మధుమేహం, రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడం, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం మంచిదని వివరించారు. ఈ శిబిరంలో 194 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పూర్వాధ్యక్షుడు సత్తి సునీల్ రెడ్డి వైద్య సిబ్బందికి పుస్తకాలు పంపిణీ చేశారు. వైద్యులను సత్కరించారు.

క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, సిహెచ్.కృష్ణమూర్తి, కె.ద్వారకానాథ్, సత్తి సునీల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.నాగేశ్వరరావు, టి.వి.రమణ, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, బోర్డు సభ్యులు వి.అప్పారావు, వై.దేముడు, ఎస్.శ్రీనివాసరావు, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు శిబిరం నిర్వహణకు సహకరించారు.

ఆరిలోవలో కొత్త వంతెనలు


సూర్యతేజానగర్, అంబేడ్కర్‌నగర్ మధ్య గెడ్డపై నిర్మించిన వంతెన

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు ఆరిలోవ ప్రాంతంలో గెడ్డలపై పలు చోట్ల కొత్త బ్రిడ్జిలు నిర్మించారు. ఇక్కడ తలపెట్టిన విశాలమైన రహదారులకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వంతెనల నిర్మాణం చేపట్టారు. ఇంత వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆరిలోవ ప్రాంతంలో రహదారుల సమస్యలు తీరలేదని, వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ సమస్యలు పరిష్కారమయ్యాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రహదారుల విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జీవీఎంసీ అధికారులు ఆరిలోవ ప్రాంతంలో రూ.కోట్ల నిధులు వెచ్చించి మూడు చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టారు.

- బీఆర్‌టీఎస్ రోడ్డు పెదగదిలి కూడలి నుంచి తోటగరువు మధ్య ఉన్న ఇరుకైన బ్రిడ్జిని తొలగించారు. ఆ స్థానంలో సుమారు రూ.4 కోట్లతో 80 అడుగుల వెడల్పుతో బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం 60 అడుగుల తోటగరువు రోడ్డు ఉన్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ 80 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మిస్తున్నట్లు అధికారులు పనుల ప్రారంభ సమయంలోనే వెల్లడించారు.
- చినగదిలి నుంచి అంబేడ్కర్ కూడలికి వెళ్లే మార్గంలో గెడ్డపై ఇరుకు బ్రిడ్జిని తొలగించారు. ఆ స్థానంలో సుమారు రూ.3 కోట్ల నిధులతో ఇక్కడ అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో 60 అడుగులు, శ్రీకాంత్‌నగర్‌కు వెళ్లే డబుల్ మార్గంలో 80 అడుగుల వెడల్పుతో బ్రిడ్జిని నిర్మించారు.
- రామకృష్ణాపురం క్వారీ చెరువు నుంచి ముడసర్లోవ రిజర్వాయరు వరకు ఉండే గెడ్డపై గ్రామం మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టారు. దీని కోసం రూ. 38.50 లక్షలు ఖర్చు చేసి గ్రామస్తుల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఈ వంతెన నిర్మాణంతో వర్షం పడితే గ్రామంలో పోటెత్తిన వరద నీటి సమస్య కూడా తీరందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పెదగదిలి, తోటగరువు మధ్యలో నిర్మించిన కొత్త బ్రిడ్జి


రామకృష్ణాపురం గ్రామం మధ్య గెడ్డపై నిర్మించిన బ్రిడ్జి